డీపీఆర్‌వోగా చెన్నమ్మ బాధ్యతలు

కలెక్టర్‌ను కలిసిన డీపీఆర్‌వో చెన్నమ్మ

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వికారాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఎ.చెన్నమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ డీపీఆర్‌వోగా విధులు నిర్వహించిన మహ్మద్ ఆరిపుద్దీన్ గద్వాల్ డీపీఆర్‌వోగా బదిలీ అయ్యారు. గద్వాల్ డీపీఆర్‌వోగా పని చేసిన చెన్నమ్మ బదిలీపై వికారాబాద్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టే క్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌లను వారి వారి చాంబర్లలో డీపీఆర్‌వో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎల్లమ్మ తల్లికి మకర తోరణం బహూకరణ

బొంరాస్‌పేట, ఫిబ్రవరి16: దుద్యాల మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ తల్లికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు దర్గా రమేశ్ మకర తోరణం బహూకరించారు. శుక్రవారం దీనిని ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డితో కలిసి అమ్మవారికి అలంకరించారు. ఇత్తడితో తయా రు చేసిన తోరణం విలువ రూ.41 వేలు ఉంటుందని ఆయన తెలిపాడు. దర్గా రమేశ్‌ను మేనేజర్ రాజేందర్‌రెడ్డి అభినందించారు. ఇదిలా ఉండగా ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండడంతో అమ్మవారి మొక్కు తీర్చుకోవడానికి ఇప్పటి నుంచే భక్తులు భారీగా తరలి వస్తున్నారు. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కులకచర్ల, ఫిబ్రవరి 16 : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కులకచర్ల కేజీబీవీ పాఠశాల ఎస్‌వో దేవి అన్నారు. శుక్రవారం పాఠశాలలో 8వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బందితో ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే శ్రద్ధగా చదువుతారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది సురేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధ్యానంతో పెరగనున్న ఏకాగ్రత

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నవీన్

పరిగి, ఫిబ్రవరి 16 : ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, విద్యార్థులు చిన్నప్పటి నుంచి ధ్యానం అలవర్చుకోవాలని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శులు బంగ్లా ఆంజనేయరెడ్డి, నవీన్ పేర్కొన్నారు. శుక్రవారం పరిగి మండలం మాదారం, పేట మాదారం గ్రామాలలో ఉపాధిహామీ కూలీలకు, పాఠశాల విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక శ్రమ, ఒత్తిళ్లతో అలసిపోయే మనసుకు ధ్యాన ఉపశమనం ఇస్తుందన్నారు. చిన్నారులు తాము చదివే అంశాలపై ఏకాగ్రత ఏర్పడాలంటే ధ్యానందోహదం చేస్తుందన్నారు. ఎలాంటి ఒత్తిళ్ల నైనా జయించవచ్చని సూచించారు.ధ్యానంతో అనేక వ్యాధుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, గుండం శైలజ, శోభిత, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూరు డీఎస్పీగా బాలకృష్ణారెడ్డి

బాలకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శేఖర్‌గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 16: తాండూరు డీఎస్పీగా బాలకృష్ణారెడి శుక్రవారం బాధ్య త లు తీసుకున్నారు. ఇప్పటివరకు పని చేసిన డీఎస్పీ శేఖర్‌గౌడ్ బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక నేతలు, అధికారులు, ప్రజల సహకారంతో ప్రభు త్వ నియమ నిబంధనల ప్రకారం బాధ్యతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తామన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

బంట్వారం ఎస్సైగా శ్రీశైలం

మర్పల్లి, ఫిబ్రవరి 16 : బంట్వారం నూతన ఎస్సైగా శ్రీశైలం శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన ఆనంద్‌కుమార్ దోమ మండల పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీశైలం ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

వికారాబాద్ డీఎస్పీగా అంజయ్య బాధ్యతలు

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వికారాబాద్ డీఎస్పీగా అంజయ్య శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు డీఎస్పీగా పని చేసిన నర్సింహులు బదిలీపై వెళ్లారు. వికారాబాద్ డీఎస్పీ కార్యాలయంలో అంజ య్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. పలువురు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

కేంద్రం విధానాలపై నిరసనలు

సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం ▪ పలుప్రాంతాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు

వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు

పరిగి, ఫిబ్రవరి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా అవలంబిస్తున్న ఆర్థిక, మతతత్వ విధానాల వల్ల ప్రజల జీవనాధాయం పడిపోయి పేదల సంఖ్య పెరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.జి.నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం పరిగిలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ సందర్భంగా పట్టణంలోని కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం దేశంలో 80కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన మగ్గిపోతున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం మళ్లీ రాయితీలు ప్రకటిస్తూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు అందరికీ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర గ్యారెంటీ చేసి చట్టం చేయాలన్నారు. మధ్య తరగతి రైతులందరికీ కేంద్రం ఒకేసారి రుణమాఫీ చేయాలన్నారు. రోజు కూలీలకు రూ.800 కనీస కూలీ ఇవ్వాలని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, గిరిజన సంఘం జిల్లా నాయకులు వెంకటరాములు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి మంగమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు ఎం.డి.హబీబ్, సత్యయ్య, రఘురామ్, కిష్టయ్య, నరేశ్, అలీ, శ్రీనివాస్, రాజేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రైతు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 16 : రైతు వ్యవసాయ కార్మిక, కర్షక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం వికారాబాద్ పట్టణంలో బీజేపీ అవలంబిస్తున్న నల్ల చట్టాలకు వ్యతిరేకంగా గ్రామీణ భారత్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయం నుంచి ఎమ్మార్పీ చౌరస్తా, మార్కెట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిపాల్‌తో పాటు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు అనంతయ్య మాట్లాడుతూ..నరేంద్ర మోదీ పదేండ్ల నుంచి దేశంలో రైతన్న, కార్మిక వర్గాన్ని వ్యవసాయ కూలీల పేదలపై ఎన్నడూ లేని రీతిలో నిత్యావసరాలధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ ఉద్యోగులు, 104, ఐకేపీ, గ్రామ పంచాయతీ, ఐద్వా మహిళా సంఘం, గిరిజన సంఘం, విద్యార్థి సంఘం, నాయకులు సత్యనారాయణ, నర్సింహులు, శ్రీనివాస్, అనసూయ, రేణుక, అనిత, అక్బర్, శ్రీనివాస్, భారతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌కు ఉపాధ్యాయుల మద్దతు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 16 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన గ్రామీణ భారత్ బంద్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మద్దతు ప్రకటించింది. ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ అధ్యక్షుడు గౌరారం గోపాల్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మికులు, రైతుల డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను, విద్యుత్ సవరణ చట్టాలను రద్దు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తేవాలని,ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని గోపాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, పీఆర్‌టీయూ నాయకులు నరేందర్, అలీమొద్దీన్, రహీం, లక్ష్మయ్య, ఎమ్మార్సీ సిబ్బంది గౌస్, ఖలీల్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కమీషన్ ఏజెంట్‌ల దుకాణాలు బంద్

పరిగి, ఫిబ్రవరి 16: పరిగిలోని మార్కెట్‌యార్డులో గల కమీషన్ ఏజెంట్‌ల దుకాణాలు శుక్రవారం బంద్ చేసి వారు నిరసన తెలిపారు. శుక్రవారం బీట్ల సందర్భంగా రైతుల సరుకు తీసుకువస్తుంటే కూరగాయల దుకాణాలు అడ్డుగా ఉంటున్నాయని, వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసిన వారి లారీలు సైతం వెళ్లడానికి ఇబ్బందిగా మారిందని గ్రెయిన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకారపు రాజు తెలిపారు. అలాగే ఇతర మార్కెట్‌లలో వలె పరిగిలో సైతం వేరుశనగ ధర తగ్గితే కొందరు వ్యక్తులు కావాలని వ్యాపారులపైకి రైతులను ఉసి గొల్పుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌లో లారీలు, ఇతర వాహనాలలో సరుకులు తీసుకువెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కారణాలతో దుకాణాలు బంద్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మోత్కూర్ పీఏసీఎస్ చైర్మన్‌పై
అవిశ్వాసం వాయిదా

దోమ, ఫిబ్రవరి 16 : మోత్కూర్ పీఏసీఎస్ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మానం శుక్రవారం వాయిదా పడిందని సీఈవో యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. అవిశ్వాస తీర్మానం శుక్రవారం నిర్వహించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఉన్నతాధికారులు రాక పోవడంతో వాయిదా వేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. చైర్మన్ పదవి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొన్నది. మోత్కూర్ పీఏసీఎస్ పరిధిలో మొత్తం డైరెక్టర్లు 13 మంది ఉన్నారు. అవిశ్వాసం నెగ్గాలంటే 9మంది డైరెక్టర్ల మద్దతు తెలిపిన వారు చైర్మన్ పదవిని చేపడుతారు. ఈ విషయమై ఇరు పార్టీల డైరెక్టర్లతో చైర్మన్ పదవి కోసం బేరసారాలు కొసాగుతున్నాయి. చైర్మన్ పదవిపై అవిశ్వాసం ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని ఉన్నతాధికారులు ఇంకా వెల్లడించలేదు. చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు
నోటిఫికేషన్ జారీ

కులకచర్ల, ఫిబ్రవరి 16 : కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 18న పీఏసీఎస్ డైరెక్టర్ల మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం డీసీవో ఈశ్వరయ్య, పీఏసీఎస్ సీఈవో బక్కారెడ్డితో కలిసి డైరెక్టర్లకు సమావేశం నోటీసును అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించి సమావేశంలో చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ అధ్యక్షుడిగా పని చేసిన బుయ్యని మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఖాళీ అయిన పీఏసీఎస్ చైర్మన్ పదవిని ప్రస్తుతం వైస్ చైర్మన్ నాగరాజు చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పీఏసీఎస్ చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఈ నెల 18న డైరెక్టర్ల సమావేశం ఏర్పాటు చేసి సమావేశంలోనే చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం. శుక్రవారం ఆయా గ్రామాల పీఏసీఎస్ డైరెక్టర్ల దగ్గరకు వెళ్లి నేరుగా సమావేశం నోటీసును డీసీవో ఈశ్వరయ్య, వారి సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పరిగి టౌన్, ఫిబ్రవరి 16: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం పరిగి మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన నర్స మ్మ(65) భర్త చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉండేది. ఆమెకు చెందిన 2.28 గుంటల భూమి విషయంలో దాయాదులతో తరుచూ గొడవలు జరుగుతుండేవని మృతురాలి చెల్లెలు కుమారుడైన బూర్గు వెంకటయ్య అనుమానం వ్యక్తం చేశాడని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

శివమాలలు ధరించిన భక్తులు...

కులకచర్ల, ఫిబ్రవరి 16 : కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు శివమాలలు ధరించారు. మల్లికార్జున స్వామికి అర్ధమండలం మాల ధరించే భక్తులు మాలను ధరించారు.

ఎల్‌వోసీ అందజేత

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 16 : దుద్యాల మండలం నాస్కంపల్లి మాజీ సర్పంచ్ సాయిలు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1.60 లక్షల ఎల్‌వోసీని కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయిలు అనారోగ్యంతో నిమ్స్‌లో చికత్స పొందుతున్నాడు. ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోగా సీఎం రేవంత్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.60 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. కార్యక్రమంలో దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పాల్గొన్నారు.

వ్యర్థ సామగ్రికి నిప్పు.. చెలరేగిన మంటలు

పూడూరు, ఫిబ్రవరి 16 : ప్రమాదవశాత్తు వ్యర్థ సామగ్రికి నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. ఈ ఘటన మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కండ్లపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 51లో గత కొంత కాలంగా ఎలాంటి అనుమతి లేకుండా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆయిల్ డ్రమ్ములు, గడువు తీరిన మందులు, ఇతర వ్యర్థ పదార్థాలను డంపింగ్ చేస్తున్నారు. ఈ వ్యర్థ పదార్థాలతో వచ్చే దుర్వాసనను భరించలేక ఇబ్బందులు పడేవారమని పలువురు రైతులు తెలిపారు. ఈ వ్యర్థ సామగ్రికి శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి భారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. హైదరాబాద్ మన్నెగూడ రోడ్డు సమీపంలో ఈ పొగలు రావడంతో మీర్జాపూర్ స్టేజీ వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వికారాబాద్, పరిగి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను చల్లార్చారు. ఎలాంటి అనుమతి లేకుండా డవిషపూరితమైన వ్యర్థాలను నిల్వ ఉంచిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పరిగి టౌన్, ఫిబ్రవరి 16: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్‌గండి సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పూడురు మండల పరిధిలోని కెరెవెళ్లి గ్రామానికి చెందిన మంగలి రాఘవేందర్(35) బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పరిగి సర్కారు దవాఖానకు తరలించారు.

తాండూరు డివిజన్‌లో
52 శాతం పన్నుల వసూలు

మార్చి నెలాఖరుకు వందశాతం: డీఎల్‌పీవో శంకర్ నాయక్

బురాన్‌పూర్‌లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న డీఎల్‌పీవో

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 16 : తాండూరు డివిజన్‌లోని ఏడు మండలాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 52 శాతం ఇంటి పన్నులను వసూలు చేసినట్లు డీఎల్‌పీవో శంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన ఇంటి పన్నుల వసూలును, రోడ్డు నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదాన్ని పరిశీలించారు. అనంతరం బొంరాస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లో ఈ ఏడాది రూ.3,31,73,596ల పన్నులను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.1,67,51,389ల పన్నులను వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.1,64,22,207ల పన్నులు వసూలు చేయాలని వీటిని మార్చి నెలాఖరు నాటికి వసూలు చేసి లక్ష్యం పూర్తి చేస్తామని చెప్పారు. బషీరాబాద్ మండలంలో రూ.30,01,189లకు గాను రూ.16,97,942లు, బొంరాస్‌పేట మండలంలో రూ.31,20,792లకు గాను రూ.13,47,342లు, దౌల్తాబాద్ మండలంలో రూ.33,29,208లకు రూ.17,92,655లు, కొడంగల్ మండలంలో రూ.32,52,538లు, పెద్దేముల్ మండలంలో రూ.46,00,010లకు రూ.23,38,926లు, తాండూరు మండలంలో రూ.99,94,927లకు రూ.45,52,383లు, యాలాల్ మండలంలో రూ.57,04,522లకు రూ.28,07,179ల పన్నులను వసూలు చేసినట్లు డీఎల్‌పీవో శంకర్ నాయక్ తెలిపారు. పన్నుల వసూలును వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆయన ఆదేశించారు.

ఇంటి నిర్మాణానికి తప్పక అనుమతి తీసుకోవాలి

గ్రామాల్లో ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో యజమానులు గ్రామ పంచాయతీ నుంచి తప్పక అనుమతి తీసుకోవాలని డీఎల్‌పీవో సూచించారు. జీపీ నుంచి అనుమతి తీసుకుంటే వారి ఇంటి యొక్క రికార్డును పంచాయతీ రికార్డులో నమోదు చేస్తామని తెలిపారు. బురాన్‌పూర్‌లో గ్రామకంఠం స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించగా సీసీ రోడ్డు నిర్మాణానికి ఇబ్బందులు రావడంతో గ్రామస్థుల సమక్షంలో విచారించి ఎవరికీ నష్ట కలుగకుండా పనులు చేపట్టాలని డీఎల్‌పీవో శంకర్ నాయక్ సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు

కొడంగల్, ఫిబ్రవరి 16 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో రాంరెడ్డి ఉపాధ్యాయ పాత్రలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయభాస్కర్ బాధ్యతలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకుంటున్న విజయభాస్కర్

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయభాస్కర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన నవీన్‌చంద్ర బదిలీ పై వెళ్లారు. ఆయన స్థానంలో విజయభాస్కర్ పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న అకాడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి మస్త రామ్

పెద్దేముల్, ఫిబ్రవరి 16 : తరగతి గదిలో విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో కనీస సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని అకాడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి మస్త రామ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16, 17 తేదీల్లో మొదటిరోజు 50శాతం, రెండో రోజు 50 శాతం ఉపాధ్యాయులతో డీఈవో రేణుకాదేవి ఆదేశాలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సందర్శించి ఉపాధ్యాయులకు పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిని పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా టీఎల్ఎంలు పరిశీలించి తెలుగు, గణితం, ఇంగ్లిష్‌లలో విద్యార్థుల కనీస సామర్థ్యాలను తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి నర్సింగ్‌రావు, ఆయా కాంప్లెక్స్‌ల హెచ్ఎంలు శివకుమార్, శంకర్, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఆర్పీలు శ్రీనివాసులు, బందెప్ప, రవికాంత్ రెడ్డి, సీఆర్పీలు సుధీర్, రఘు, ఎమ్మార్సీ సిబ్బంది కృష్ణ, గురు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బొంరాస్‌పేట జీహెచ్ఎం హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశంలో జీహెచ్ఎం మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ తొలి మెట్టు లక్ష్యాలను చేరుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయా లన్నారు. సమావేశంలో పాఠశాలలకు విద్యార్థుల హాజరు, విద్యార్థుల ప్రగతి, టీఎల్ఎం ప్రదర్శన, తయారు, పీరియడ్ ప్రణాళిక, వర్క్‌షీట్ల ఉపయోగం, మాదిరి పాఠం ప్రదర్శన అంశాలపై చర్చించారు.

దోమ: విద్యార్థులు చదవడం, రాయడంతో వారి భాషా నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈవో హరిశ్చందర్ సూచించారు. మండల పరిధిలోని బొంపల్లి, దోమ, కిష్టాపూర్, దాదాపూర్ కాంప్లెక్స్ పరిధిలో శుక్రవారం ఆయా కాంప్లెక్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో ఎంఈవో పాఠశాలలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకట్, హెచ్ఎంలు రాములు, జయరాం, లాల్యానాయక్, సీఆర్పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: విద్యార్థులకు ఉపాధ్యాయులు గుణాత్మకమైన విద్యను అందించాలని కులకచర్ల ఎంఈవో అబీబ్‌హైమద్ అన్నారు. శుక్రవారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962